కక్షసాధింపులు తప్ప.. ఏం అభివృద్ధి చేశారు..?


డిజిటల్ బుక్ క్యూఆర్ కోడ్ పోస్టర్లను ఆవిష్కరిస్తున్న మాజీ ఎమ్మెల్యే అప్పలనరసయ్య, తదితరులు

- టీడీపీ కూటమి ప్రభుత్వం ఏడాదిన్నర పాలనలో చేసిన అభివృద్ధి శూన్యం
- ఎన్నికల హామీలపై నిలదీసే వారిపై కేసులు పెడుతున్నారు
- డిజిటల్ బుక్ ఆవిష్కరణలో మాజీ ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య

గజపతినగరం: టీడీపీ కూటమి అధికారంలోకి వచ్చి ఏడాదిన్నర కావస్తోందని, ఈ ఏడాదిన్నర కాలంలో ప్రభుత్వాన్ని ప్రశ్నించే వారిపై వేధించడం, కేసులు పెట్టడం తప్ప చేసిన అభివృద్ధి, సంక్షేమం ఏమీ లేదని గజపతినగరం మాజీ ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య విమర్శించారు. వైఎస్సార్‌సీపీ ప్రవేశ పెట్టిన డిజిటల్ బుక్‌కు సంబంధించిన క్యూఆర్ కోడ్ పోస్టర్‌ను గజపతి నగరంలోని పార్టీ కార్యాలయంలో నాయకులతో కలిసి అప్పలనరసయ్య ఆదివారం ఆవి రించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ కార్యకర్తలకు ఎక్కడ అన్యాయం జరిగినా వెంటనే డిజిటల్ బుక్‌లో లాగిన్ అయి వివరాలు నమోదు చేస్తే వారికి పార్టీ అండగా ఉంటుందని చెప్పారు. వేధింపులు, ఇబ్బందు లు ఎదురైతే డిజిటల్ బుక్‌లో ఫోన్ నంబర్, ఇతర వివరాలు పొందుపరచాలని సూచించారు.

రూ.లక్షల కోట్లు అప్పు చేశారు..

కూటమి ప్రభుత్వం ఈ ఏడాదిన్న పాలనలో సుమారు రెండు లక్ష కోట్ల రూపాయల వరకు అప్పు చేసిందని, ఈ డబ్బులతో ఏం అభివృద్ధి చేశారో ప్రభుత్వ పెద్దలు చెప్పాలని అప్పలనరసయ్య నిలదీశారు. ఎక్కడా అభివృద్ధి చేయలేదని, ఎన్నికల్లో ఇచ్చిన హామీలను కూడా అమలు చేయకుండా కాలయాపన చేస్తున్నారని మండిపడ్డారు. సూపర్-6తో పాటు వందల హామీలు ఇచ్చారని, ఒకటి రెండు పథకాలను ప్రారంభించి, వాటిని కూడా అరకొరగా అమలు చేస్తున్నారని, చేసిన అప్పు ఏమైపోతుందో తెలియడం లేదన్నారు. ఎన్నికల హామీలు ఎందుకు నెరవేర్చడం లేదని ఎవరైనా ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తే వారిపై దౌర్జన్యాలు చేయడంతో కేసులు పెట్టిస్తున్నారని, పూటకో డైవర్షన్ రాజకీయం చేస్తున్నారని మండిపడ్డారు. కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత ఒక్కరికి కూడా కొత్తగా పింఛన్ మంజూరు చేయలేదని, ఇంతకంటే దౌర్భాగ్యం మరొకటి లేదన్నారు. నిరుద్యోగ భృతి, ఆడబిడ్డ నిధి పథకాలను ఎప్పుడు అమలు చేస్తారని, 50 ఏళ్లు నిండిన బీసీలకు ఎప్పుడు పింఛన్ ఇస్తారని ప్రభుత్వాన్ని నిలదీశారు. తల్లికి వందనం పథకం డబ్బులు చాలామందికి జమకాలేదని గుర్తు చేశారు. పేదింటి పిల్లలు వైద్య విద్య చదువుకోవాలని, పేద ప్రజలకు వైద్యసేవలు మరింత చేరువ కావాలన్న ఉద్దేశంతో గత ప్రభుత్వంలో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి 17 ప్రభుత్వ మెడికల్ కాలేజీలను తీసుకొస్తే వాటిని సీఎం చంద్రబాబునాయుడు ప్రైవేటు పరం చేయడం సిగ్గుచేటని అన్నారు. కూటమి ప్రభుత్వ తప్పుడు విధానాలను, ప్రజలకు చేస్తున్న మోసాలను, అవినీతి, అక్రమాలను ప్రజల్లోకి తీసుకువెళతామని చెప్పారు. ఇందు కోసం త్వరలో నియోజకవర్గంతో పాటు గ్రామ స్థాయిలో వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్. జగన్ మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు ఎనిమిది రకాల కమిటీలను ఏర్పాటు చేయనున్నామని, డిసెంబర్ 15లోగా ఈ ప్రక్రియ పూర్తి చేస్తామని తెలిపారు.

రైతును రోడ్డెక్కించారు..

దేశానికి వెన్నెముకగా పిలుచుకునే అన్నదాతను కూటమి ప్రభుత్వం రోడ్డున పడేసిందని అప్పలనరసయ్య ఆవేదన వ్యక్తం చేశారు. ఒక బస్తా యూరి యా కోసం రైతులు ప్రైవేటు ఎరువుల దుకాణాలు, రైతుసేవా కేంద్రాల వద్ద క్యూలు కట్టి పడిగాపులు పడాల్సి వస్తోందని అన్నారు. గతంలో ఎప్పుడూ ఈ పరిస్థితి చూడలేదన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో రైతులకు గ్రామాల్లోనే రైతు భరోసా కేంద్రాల ద్వారా ఎరువులు,విత్తనాలు సరిపడా అందించా మని గుర్తు చేశారు. ప్రభుత్వం ఎరువుల పంపిణీతో పాటు పంటలకు గిట్టుబాటు ధర కల్పించడంలో ఘోరంగా విఫలమైందని ఆరోపించారు. ప్రభు త్వం వైఫల్యం వల్ల రైతులు నష్టపోతున్నారని,ఈ ప్రభుత్వానికి వారి ఉసురు తప్పక తగులుతుందని అన్నారు.

బాలకృష్ణ బహిరంగంగా క్షమాపణ చెప్పాలి

మాజీ ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డితో పాటు సినీనటుడు, మెగాస్టార్ చిరంజీవిపై అసెంబ్లీలో అనుచితంగా మాట్లాడిన హిందూపురం ఎమ్మెల్యే, సినీ నటుడు నందమూరి బాలకృష్ణ బహిరంగ క్షమాపణలు చెప్పాలని అప్పలనరసయ్య డిమాండ్ చేశారు.వైఎస్సార్‌సీపీ జిల్లా ఎస్సీసెల్ అధ్యక్షుడు పీరుబండి జైహింద్ కుమార్,గజపతిగరం,దత్తిరాజేరు,గంట్యాడ మండలాల జెడ్పీటీసీలు గార తవుడు,రౌతు రాజేశ్వరి, వర్రి నరసింహ మూర్తి, గజపతినగరం,జామి మండలాల వైఎస్సార్‌సీపీ అధ్యక్షులు బూడి వెంకటరావు,గొర్లె రవికుమార్, దత్తిరాజేరు ఎంపీపీ సింహాద్రి అప్పలనాయుడు, పార్టీ సీనియర్ నేతలు బెల్లాన త్రినాథరావు,కరణం ఆదినారాయణ,మండల సురేష్, కడుపుట్ల పైడిపునాయుడు,గేదెల ఈశ్వరరావు,స్వామినాయుడుపాల్గొన్నారు.

క్లుప్తంగా

జెడ్పీ చైర్మన్ పరామర్శ


చినబాబు చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు

గుర్ల: మండలంలోని అచ్యుతపురం గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు టి.చినబాబు వారం రోజుల క్రితం మృతి చెందారు. ఆయన కుటుంబ సభ్యులైనా తెట్టంగి సొసైటీ మాజీ చైర్మన్ టి.రవిబాబును జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు ఆదివారం పరామర్శించారు. చినబాబు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఆయన వెంట వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి కె.వి.సూర్యనారాయణ రాజు, జెడ్పీటీసీ శీర అప్పలనాయుడు, మండల పార్టీ అధ్యక్షుడు పొట్నూరు సన్యాసినాయుడు, బెల్లాన బంగారునాయుడు, జమ్ము స్వామినాయుడు ఉన్నారు.

యూరియా పంపిణీ


తెట్టంగిలో యూరియా కోసం క్యూలో ఉన్న రైతులు

గుర్ల: మండలంలోని తెట్టంగి ఆర్ఎస్‌కేలో గత 20 రోజులుగా యూరియా ఉన్నప్పటికీ అధికారులు పంపిణీ చేయడం లేదని ఈ నెల 26న రైతన్నల ఆగ్రహం శీర్షికతో సాక్షి కథనం ప్రచురించింది. దీనికి అధికారులు స్పందించారు. ఆదివారం తెట్టంగి ఆర్ఎస్‌కే వద్ద యూరియా పంపిణీ చేశారు. యూరియా పంపిణీ చేస్తున్నారనే విషయం తెలుసుకున్న తెట్టంగి, పొలాయవలస రైతులు తెల్లవారుజాము నుంచే క్యూలైన్‌లో ఉన్నారు. తెట్టంగి సొసైటీ పరిధిలోని మిగిలిన గ్రామాలకు చెందిన రైతులకు యూరియా పంపిణీ చేయకపోవడంతో వారు ఆగ్రహం వ్యక్తం చేశారు.

గ్రంథాలయానికి కంప్యూటర్ల వితరణ


గ్రంథాలయానికి కంప్యూటర్లు, ఇతర సామగ్రి అందజేస్తున్న దాతలు

వేపాడ: స్థానిక శాఖా గ్రంథాలయానికి పలువురు దాతలు ఆదివారం కంప్యూటర్లు, బుక్స్ ర్యాక్స్, పుస్తకాలు అందజేశారని లైబ్రేరియన్ చంద్రశేఖర్ తెలిపారు.వల్లంపూడి గ్రామానికి చెందిన సీతారామ యువజన సేవా సంఘం సభ్యులు రెండు కంప్యూటర్లు, టేబుల్స్, మూడు పుస్తకాల ర్యాక్స్, కాంపిటేటివ్ బుక్స్, సుమారు రూ.23 వేల విలువైన ఫర్నీచర్ సమకూర్చారు. అలాగే బెంగళూరుకు చెందిన శివ శ్రీ చారిటబుల్ ట్రస్ట్ సభ్యు లు రెండు కంప్యూటర్లతో పాటు, ఆండ్రాయిడ్ టీవీ, స్మార్ట్ మొబైల్ అందించారు. దాతలకు లైబ్రేరియన్‌తో పాటు పాఠకులు కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం దాతలు గ్రంథాలయ ఆవరణలో మొక్కలు నాటారు.

జాషువా జయంతి


జాషువా చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న బాపూజీ సేవా సంఘం సభ్యులు

శృంగవరపుకోట: పట్టణంలోని బాపూజీ సేవా సంఘం ఆధ్వర్యంలో కవికోకిల గుర్రం జాషువా జయంతిని ఆదివారం నిర్వహించారు. సేవా సంఘం సభ్యులు జాషువా చిత్రప టానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మాజీ వైస్ ఎంపీపీ నానిగిరి రమణాజీ, జియో రామకృష్ణ, చిప్పాడ శేషగిరిరావు, మోపాడ చిన్నికృష్ణ, దొడ్డి సూర్యారావు, బొండా వెంకటరమణ, వసంత వెంకటర మణ, గనివాడ వల్లయ్య, బాలి రామకృష్ణ, బర్ల స్వామినాయుడు, తదితరులు పాల్గొన్నారు.

రేబిస్‌పై అవగాహన


వియ్యంపేటలో ర్యాలీ చేస్తున్న వైద్య సిబ్బంది

కొత్తవలస: వరల్డ్ రేబిస్ డే సందర్భంగా మండలంలోని వియ్యంపేట గ్రామంలో స్థానిక పీహెచ్‌సీ వైద్యసిబ్బంది ఆదివారం అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా వైద్యాధికారి సింహాద్రినాయుడు మాట్లాడుతూ రేబిస్ వ్యాధిప్రధానంగా కుక్క కాటు ద్వారా మానవులకు సంక్రమిస్తుందన్నారు. ఈ వ్యాధి ప్రాణాంతకమైనప్పటికీ నివారించ వచ్చని తెలిపారు.ఈ వ్యాధి ప్రధానంగా నాడీవ్యవస్థపై ప్రభావతం చూపిస్తుందని, వ్యాధి లక్షణాలు కనిపించక ముందే రేబిస్ వ్యాక్సిన్ వేసుకోకపోతే మరణానికి దారితీస్తుందన్నారు.ఆరోగ్య సిబ్బంది సత్యారావు ఆధ్వర్యంలో మండలంలోని వీరభద్రపురం,నిమ్మలపాలెం గ్రామాల్లో అవగాహన కల్పించారు.

దళిత విముక్తి సత్యశోధక్ మహాసభ రేపు



మాట్లాడుతున్న దళిత విముక్తి రాష్ట్ర కన్వీనర్ వెంకటరమణ, తదితరలు

కొత్తవలస: మహాత్మా జ్యోతిరావు పూలే సత్య శోధక్ సమాజ్ ఏర్పాటు చేసి 152 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా ఈనెల 30వ తేదీన మండల కేంద్రంలోని ఓ కల్యాణ మంటపంలో దళిత విముక్తి ఆధ్వర్యంలో మహాసభ నిర్వహించనున్నట్లు దళిత విముక్తి రాష్ట్ర కన్వీనర్ సుర్ల వెంకటరమణ తెలిపారు. మండల కేంద్రంలో దళిత నేతలతో కలిసి ఆదివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో వెంకటరమణ మాట్లాడుతూ నాటి సమాజంలో మనుషులంతా సమానమని మహాత్మ జోతీరావుపూలే అన్నారని తెలిపారు. జ్యోతిరావు పూలే తన జీవిత భాగస్వామితో కలిసి 1873లో సత్యశోదక్ సమాజ్‌ను ఏర్పాటు చేశారని గుర్తు చేశారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం వచ్చిన తర్వాత ప్రజలపై మతత్వం రుద్దడం, దళిత,బహుజనులు, స్త్రీలపై దాడులు పెరిగిపోయాయని అన్నారు. 30వ తేదీన నిర్వహించనున్న మహాసభ, భారీ ర్యాలీ కార్యక్రమానికి తెలుగు రాష్ట్రాల నుంచి పెద్ద ఎత్తున దళిత నాయకులు హాజరవుతారని తెలిపారు. జిల్లాలోని దళితులంతా హాజరై విజయవంతం చేయాలని కోరారు.

దళిత సంక్షేమాన్ని విస్మరించిన ప్రభుత్వం


మాట్లాడుతున్న దళిత ఉద్యమ నేత ఉదయ భాస్కర్, తదితరులు

లక్కవరపుకోట: దళితుల సంక్షేమాన్ని కూటమి ప్రభుత్వం విస్మరించిందని, దళితులపై ప్రభుత్వానికి నిర్లక్ష్యం తగదని దళిత ఉద్యమ నేత ఆతవ ఉదయ భాస్కర్ అన్నారు. సీతారాంపురం గ్రామంలోని అంబేడ్కర్ విజ్ఞాన భవనం వద్ద ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఎస్సీ,ఎస్టీ సబ్‌ప్లాన్ నిధులు,ఎస్సీ కార్పొరేషన్ రుణాలు,భూమి కొనుగోలు పథకం,బ్యాక్ లాగ్ పోస్టుల భర్తీ, విదేశీ విద్య,కులాంతర వివాహాలకు ప్రోత్సాహం ఇలా 28 రకాల పథకాలను అమలు చేస్తామని ఎన్నికల్లో సీఎం చంద్రబాబునాయుడు హామీ ఇచ్చారని గుర్తు చేశారు.అధికారం చేపట్టి 16 నెలలు అవుతున్నా నేటికీ ఎస్సీ,ఎస్టీలకు ఇచ్చిన ఒక్క హామీ కూడా నెరవేర్చలేదని ఆరోపించారు.కానీ ఎన్నికల హామీల్లో 90 శాతానికి పైగా నెరవేర్చామని ప్రభుత్వ పెద్దలు చెప్పుకోవడం సిగ్గుచేటని అన్నారు.ప్రభుత్వంపై ఇప్పటికే ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత ఉందని, రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో తగిన బుద్ధి చెప్పేందుకు దళితులు సిద్ధంగా ఉన్నారన్నారు. దళిత నాయుకులు గుర్రపు శ్రీను, టి.సూరిబాబు, కొత్రాష్, బి.ఈశ్వరరావు, వెంకటరమణ, బంగారయ్య, తదితరులు పాల్గొన్నారు.

జిల్లా స్థాయి గోవిజ్ఞాన పరీక్షల్లో ప్రతిభ


పరీక్షల్లో ప్రతిభకనబరిచిన సర్వేపల్లి పాఠశాల విద్యార్థులు

శృంగవరపుకోట: రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్, గోపాలకృష్ణ గోసేవ సమితి సంయుక్తంగా ఆదివారం విజయనగరంలో నిర్వహించిన జిల స్థాయి గోవిజ్ఞాన పరీక్షలో పట్టణానికి చెందిన సర్వేపల్లి పాఠశాల విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచారని ఆ పాఠశాల ప్రిన్సిపాల్ పి.పైడిరాజు చెప్పారు. నిర్వాహకులు జిల్లా వ్యాప్తంగా పోటీలో పాల్గొన్న విద్యార్థుల నుంచి ఒక్కో విభాగంలో ఆరుగురు విజేతల చొప్పున ఎంపిక చేయగా సర్వేపల్లి స్కూల్ విద్యార్థులు పాదం కావ్యశ్రీ, గూనూరు జాహ్నవి ప్రథమ స్థానం, అంబటి గ్రీష్మ ద్వితీయ స్థానం, కె.మోహితవర్షిణి, ఎస్.వేదశ్రీ, ఆర్.వి.ఎస్.ఎస్.ఎస్.శ్రావ్య, ఆర్.హర్షితనాయుడు, ఎం.హేమాంజలి తృతీయ స్థానాలు సాధించారు.వీరికి నిర్వాహకులు బహుమతులతో పాటు జ్ఞాపికలు అందజేశారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

గజపతినగరం: స్థానిక సబ్‌స్టేషన్ పరిధిలోని పలుగ్రామాలకు సోమవారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలగనుందని విద్యుత్ శాఖ బొబ్బిలి కార్యనిర్వాహక ఇంజినీర్ బి.రఘు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. చల్లపేట ఫీడర్ పరిధిలోని విద్యుత్ లైన్లను ఆనుకుని ఉన్న చెట్ల కొమ్మల తొలగింపు పనులు, ఇతర మరమ్మతులు చేపట్టనున్నట్టు పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో గంగచోళ్ల పెంట పాతబగ్గాం, కొత్తబగ్గాం, బంగారమ్మపేట, భూదేవిపేట, దావాలపేట, బూడిపేట, కొనిశ, మెంటాడ, మర్రివలస, చిట్టాయవలస, తదితర గ్రామాలకు విద్యుత్ సరఫరా ఉండదని ప్రజలు సహకరించాలని కోరారు.

స్మార్ట్ పోలీసింగ్‌తో మెరుగైన సేవలు

విజయనగరం క్రైమ్ : స్మార్ట్ పోలీసింగ్‌తో ప్రజలకు మెరుగైన సేవలు అందుతాయని ఎస్పీ ఏఆర్ దామోదర్ అన్నారు. నగరంలోని టూటౌన్ పోలీస్ స్టేషన్‌ను ఆదివారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సీసీ కెమెరాల ఏర్పాటుపై సీఐ శ్రీనివాస్‌ను అడిగి తెలుసుకున్నారు. కమాండ్ కంట్రోల్ రూమ్‌లో ఉన్న దాదాపు 50 సీసీ కెమెరాలను పరిశీలించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సిబ్బందికి సూచించారు. ఆయన వెంట ఎస్సైలు కృష్ణమూర్తి, చంద్ర, కనకరాజు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

నేడు డిజిటల్ బుక్ ఆవిష్కరణ

కొత్తవలస: మండలంలోని అర్థన్నపాలెం గ్రామ సమీపంలోని తన క్యాంపు ఆఫీస్‌లో సోమవారం డిజిటల్ బుక్ ఆవిష్కరించనున్నట్లు ఎస్. కోట మాజీ ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. కూటమి ప్రభుత్వంలో అన్యాయానికి,దాడులకు గురవుతున్న వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు అండగా ఉండేందుకు, ఇటీవల వైఎస్సార్‌సీపీ అధిష్టానం డిజిటల్ బుక్‌ను రూపొందించిందని పేర్కొన్నారు. డిజిటల్ బుక్ క్యూ ఆర్ కోడ్ పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమానికి నియోజకవర్గంలో పార్టీ ముఖ్య నాయకులు,సర్పంచ్‌లు,ఎంపీటీసీ సభ్యులు హాజరుకావాలని కోరారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్

శృంగవరపుకోట: పట్టణంలో అయిదుగురు పేకాటరాయుళ్లను ఎస్.కోట పోలీసులు ఆదివారం అరెస్టు చేశారు. పట్టణంలోని కందాలవీధిలో పేకాట ఆడుతున్నట్టు పోలీసులకు సమాచారం అందడంతో ఎస్.కోట ఎస్ఐ తన సిబ్బందితో కలిసి పేకాట శిబిరంపై దాడులు చేశారు. అయిదు గురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని వారి నుంచి రూ.25,150 స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేశామని ఎస్.కోట సీఐ వి.నారాయణమూర్తి తెలిపారు.

మహాచండీదేవిగా దుర్గమ్మ దర్శనం


కొత్తవలస: చిన్నిపాలెంలో అమ్మవారిని దర్శించుకుంటున్న జెడ్పీ చైర్మన్ శ్రీనివాసరావు,తదితరులు


బొండపల్లి: మహాచండీ దేవిగా దర్శనమిచ్చిన దేవుపల్లిలోని రాజరాజేశ్వరీదేవి అమ్మవారు


జామి: అలమండలో మహాచండీదేవిగా దుర్గామాత దర్శనం


బొండపల్లి: గొట్లాం బంగారమ్మ తల్లి ఆలయం వద్ద పూజల్లో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే అప్పలనరసయ్య


బొండపల్లి: కొవ్వాడపేటలో కుంకుమ పూజలు చేస్తున్న మహిళలు

బొండపల్లి: శరన్నవరాత్రి ఉత్సవాలు మండలంలో వైభవంగా జరుగుతున్నాయి. ఆలయాల్లో, గ్రామాల్లో ఏర్పాటు చేసిన మంటపాల్లో ఏడో రోజు అమ్మవారు మహా చండీదేవిగా భక్తులకు ఆదివారం దర్శనమిచ్చారు. దేవుపల్లిలోని రాజరాజేశ్వరీదేవి ఆలయంలో అర్చకులు అమ్మవారిని మహాచండీదేవిగా అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. కొవ్వాడపేట గ్రామంలోని రామాలయంలో అర్చ కులు రమణ ఆధ్వర్యంలో మహిళలు సామూహిక కుంకుమ పూజలు చేశారు.గొట్లాం గ్రామంలోని బంగారమ్మతల్లి అమ్మవారిని గజపతినగరం మాజీ ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య దర్శించుకుని, ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయ ఆవరణలో ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఎంపీపీ నీలంశెట్టి గోపెమ్మ, మాజీ ఎంపీపీ గొరపల్లి శివ, వైఎస్సార్ సీపీ నాయకులు గొరపల్లి రవికుమార్, మదీన అప్పలరమణ, ప్రకాష్, పి.ఎస్.ఎన్.పాత్రుడు తదితరులు పాల్గొన్నారు.

అమ్మవారిని దర్శించుకున్న జెడ్పీ చైర్మన్

కొత్తవలస: శరన్నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని మండలంలోని చిన్నిపాలెం గ్రామంలో ఏర్పాటు చేసిన మంటపంలో దుర్గాదేవి అమ్మవారిని జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, మాజీ ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు, వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి నెక్కల నాయుడుబాబు ఆదివారం దర్శించుకు న్నారు. ఉత్సవ నిర్వాహకులు వీరికి పూర్ణకుంభంతో స్వాగతం పలికారు.

అలమండలో అన్నదానం

జామి: అలమండ గ్రామంలో దుర్గాదేవి ఆలయంలో అమ్మవారు ఆదివారం మహాచండీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు.ఆలయ ప్రధాన అర్చకులు శర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం ఆలయం వద్ద భారీ అన్నదానం చేశారు.

దత్తిరాజేరు మండలంలో..

దత్తిరాజేరు: కోమటిపల్లి, మరడం, కృష్ణాపురం, పెదమానాపురం, గడసాం,పోరలి, తదితర గ్రామాల్లో శరన్నవరాత్రి ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. ఆయా గ్రామాల్లో ఏర్పాటు చేసిన మంటపాల్లో అమ్మవారు ఆదివారం మహా చండీదేవి, లక్ష్మీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు.భక్తులు విశేష పూజలు చేశారు.

ఆకట్టుకున్న భరతనాట్య ప్రదర్శన


కళాకారిణుల నృత్య ప్రదర్శన

విజయనగరం టౌన్: దసరా శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా స్థానిక బాబామెట్టలో గల వరలక్ష్మి నాట్యాలయం విద్యార్థులు ద్వారకా తిరుమలలో ఆదివారం భరతనాట్య ప్రదర్శన ఇచ్చారు. వేంకటేశ్వరస్వామి దేవస్థానం వారి పిలుపు మేరకు కుంకుళ్లమ్మ దేవాలయంలో నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాల్లో 'మహాచండీ అవతారం' అనే పాటకు నృత్యం చేశారు. నాట్యాలయం గురువు పేరి వరలక్ష్మి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ ప్రదర్శనలో సాయివెన్నెల, మనస్విని, మౌనిక, నిఖిత, లలిత, సాహిత్య, శివశ్యామశ్రీ, జాహ్నవి కృష్ణ, సిరిచందన, మాన్యవి, వినయశ్రీ, లోచన, లౌక్య, కుందన, యాశ్రిత నాట్యం చేసి భక్తులను అలరించారు.

వినియోగంలోకి వచ్చేదెప్పుడో..?

- 16వ నంబర్ జాతీయ రహదారిలో విశ్రాంతి భవనాలు
- 50 కిలోమీటర్లకొక రెస్ట్ ఏరియా
- భోగాపురం పరిధిలో ఏర్పాటు చేసిన హైవే అధికారులు
- నేటికీ వినియోగంలోకి రాని వైనం


వినియోగంలోని రాని విశ్రాంతి గృహాలు


వాహనాలు నిలుపుకునేందుకు ఏర్పాటు చేసిన పార్కింగ్ స్థలం

భోగాపురం: జిల్లా పరిధిలోని 16వ నంబర్ జాతీయ రహదారిపై ప్రమాదాలను అరికట్టాలనే ఉద్దేశంతో జాతీయ రహదారుల అభివృద్ధి సంస్థ (ఎన్‌హెచ్‌ఏఐ) విశ్రాంతి గృహాలను (రెస్ట్ ఏరియాలు) ఏర్పాటు చేసింది. సువిశాలమైన పార్కింగ్ ప్రాంగణంలో వాహనాలకు పార్కింగ్ సౌకర్యం, డ్రైవర్లు, క్లీనర్లు విశ్రాంతి తీసుకునేందుకు పడకలు, వారికి అవసరమైన ఆహార పదార్థాలు అందించేందుకు క్యాంటీన్ సదుపాయాలను కూడా అధికారులు ఏర్పాటు చేశారు. ఒకేసారి వందకు పైగా వాహనాలను నిలుపుకునే వీలుంది. వీటి ఏర్పాటుతో ప్రమాదాల సంఖ్య గణనీయంగా తగ్గుముఖం పడుతుందని ప్రభుత్వం, ఎన్‌హెచ్‌ఏఐ, పోలీసులు అధికారులు భావించారు. అయితే ఎన్‌హెచ్‌ఏఐ అధికారులు ఏర్పాటు చేసిన విశ్రాంతి గృహాలు (రెస్ట్ ఏరియా) వినియోగంలోకి రాకపోవడంతో దూర ప్రాంతాలు ప్రయాణం సాగించే డ్రైవర్లు అలసట చెంది ప్రమాదాల బారిన పడుతున్నారు. జిల్లాలోని భోగాపురం, పూసపాటిరేగ మండలాల్లో 16వ నంబర్ జాతీయ రహదారి విస్తరించి ఉంది. రాజాపులోవ నుంచి కందివలస గెడ్డ వరకు సుమారు 30 కిలోమీటర్ల పొడవునా ఈ రహదారి ఉంది. అటు కోల్‌కతా నుంచి ఇటు చెన్నై నుంచి ఈ జాతీయ రహదారిపై రోజుకు వేల సంఖ్యలో వాహనాల రాకపోకలు సాగిస్తుంటాయి. రోజుల తరబడి డ్రైవర్లు నిద్ర లేకుండా తమ వాహనాలను నడుపుతారు. అయితే జాతీయ రహదారి నుంచి పార్కింగ్ స్థలంలోకి వాహనాలు వెళ్లేందుకు ఇటు ప్రభుత్వం అటు హైవే అధికారులు కలిసి జాతీయ రహదారి నుంచి పార్కింగ్ స్థలం వరకు కనెక్టివ్ రోడ్డును ఏర్పాటు చేయాల్సి ఉంది. ఏళ్లు గడుస్తున్న ఇంతవరకు కూటమి ప్రభుత్వం ఆ పని చేయడం లేదు. దీంతో వాహనాలు నిలిపేందుకు సౌకర్యం లేకపోవడంతో రోడ్డుపైనే పార్క్ చేసి ఆ వాహనాల్లో డ్రైవర్లు, క్లీనర్లు నిద్రపోతున్నారు. ఆ సమయంలో అదే దారిలో ప్రయాణించే వాహనాలు పార్కింగ్ చేసే వాహనాలను ఢీకొన్న సంఘటనలు చాలా జరిగాయి. ఈ ప్రమాదాలను అరికట్టేందుకు 50 కిలోమీటర్లకు ఒకటి చొప్పున రెస్ట్ ఏరియాలను ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. దీనిలో భాగంగా జిల్లా పరిధిలోని భోగాపురం జాతీయ రహదారి రోడ్డు పక్కన ఏర్పాటు చేసిన విశ్రాంతి గృహాలను వినియోగంలోకి తీసుకుని వచ్చినట్లయితే చాలావరకు రోడ్డు ప్రమాదాలు తగ్గుముఖం పడతాయని వాహనదారులు అంటున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి వాటిని వినియోగంలోకి తీసుకువచ్చి రోడ్డు ప్రమాదాలు తగ్గుముఖం పట్టేలా చర్యలు తీసుకోవాలని వాహనదారులు కోరుతున్నారు.

చర్యలు తీసుకుంటాం



భోగాపురం, పూసపాటిరేగ మండలాల పరిధిలోని 16వ నంబర్ జాతీయ రహదారుల్లో రోడ్డు ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయి. ఈ ప్రమాదాలను నియంత్రించేందుకు ప్రభుత్వం, ఎన్‌హెచ్‌ఏఐ అధికారులు ఇప్పటికే డ్రైవర్లు విశ్రాంతి తీసుకునేందుకు భోగాపురంలో రెస్ట్ ఏరియాను ఏర్పాటు చేశారు. అయితే రెస్ట్ ఏరియా వినియోగంలోకి రాకపోవడంతో ప్రమాదాలు ఎక్కువగా సంభవిస్తున్న మాట వాస్తవమే. ఈ సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లి విశ్రాంతిగృహాలను వియోగంలోకి తెచ్చే విధంగా చర్యలు చేపడతాం.

– కె దుర్గాప్రసాద్,
భోగాపురం (అప్‌గ్రేడ్ పోలీస్‌స్టేషన్) సీఐ,